క్లుప్తంగా

భద్రత కట్టుదిట్టం



కుక్కునూరు ప్రధాన సెంటర్‌లో బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

కుక్కునూరు: సార్వత్రిక ఎన్నికల ఫలితాల ప్రక్రియ మంగళవారం నిర్వహిస్తుండడంతో మండలంలో 144 సెక్షన్‌ను అమలు చేస్తున్నారు. సోమవారం ఉదయం నుంచే పోలీసులు కుక్కునూరు ప్రధాన సెంటర్‌లో బందోబస్తు చేపట్టారు. ఇప్పటికే మండలంలోని పలు గ్రామాల్లో మైక్‌తో ప్రచారం చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. ఫలితాల విషయమై గొడవలు పడినా, బాణసంచా కాలినా, అల్లర్లకు పాల్పడిన కఠిన చర్యలు తీసుకుంటామని ప్రచారం పేర్కొన్నారు. కాగా ఎన్నికల ఫలితాల్లో విజయంపై ఆయా పార్టీల కార్యకర్తలు, నాయకులు ఎవరికి వారు ధీమా వ్యక్తం చేస్తుండటంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. మరో పక్క గెలుపుపై పందాలు కాసిన వారు కాసింత ఆందోళనలో ఉన్నారు.

అన్నసమారాధన

టి.నరసాపురం: హనుమాన్ జయంత్యుత్సవాలను పురస్కరించుకుని టి.నరసాపురం ప్రధాన సెంటర్‌లోని హనుమాన్ విగ్రహం వద్ద సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేలాదిమంది భక్తులకు అఖండ అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ పీసీహెచ్.శ్రీనివాస రెడ్డి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని హరిజనపేటకు చెందిన దోసూరి నాగరాజు ఈ నెల 2న ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడన్నారు. సాయంత్రం అయినా ఇంటికి తిరిగి రాకపోవడంతో అతని కోసం గాలింపు చేపట్టారని, ఈ నేపథ్యంలో ఇంటిలో ఒక లెటర్ దొరికినట్లు తెలిపారు. దీంతో సోమవారం నాగరాజు అదృశ్యం అయినట్లు తల్లి దోసూరి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ తెలిపారు.

వాసుబాబు విజయం కోరుతూ..



మోకాళ్లపై మేరీమాత ఆలయ మెట్లు ఎక్కుతున్న చిన్నారావు

గణపవరం (ఉంగుటూరు): ఉంగుటూరు ఎమ్మెల్యేగా పుప్పాల వాసుబాబు, ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ రెండోసారి విజయం సాధించాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ అభిమాని మోకాళ్లపై గొరిపట్నం మేరీమాత ఆలయం మెట్లు ఎక్కి తన కోరిక నెరవేర్చాలని మేరీమాతను వేడుకున్నాడు. ఉంగుటూరు మండలం చేబ్రోలు గ్రామానికి చెందిన చేబోయిన చిన్నారావు సోమవారం గొరిదేవి ఆలయానికి వెళ్లి మోకాళ్లపై కొండమెట్లు ఎక్కి మేరీమాతను ప్రార్థించి తన కోరిక నెరవేర్చాలని వేడుకున్నాడు.

ఉత్సాహంగా విద్యార్థులకు శిక్షణ తరగతులు

భీమడోలు: విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దేందుకు గ్రంథాలయాలు దోహదపడతాయని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా కెరీర్ గైడెన్స్ డైరెక్టర్ తుమ్మల వెంకట ఉమామహేశ్వరరావు అన్నారు. భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా సోమవారం ఉత్సాహంగా విద్యార్థులకు శిక్షణ తరగతులు నిర్వహించారు.భీమడోలులో గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తుమ్మల వెంకట ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి గ్రంథాలయాన్ని వినియోగించుకుని విజ్ఞానవంతులుగా మారి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. గ్రంథపాలకులు డీఎస్‌బీ అమర్‌నాథ్, జి.నాగమణి, పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుండుగొలను వారపు సంత శుక్రవారానికి వాయిదా

భీమడోలు: గుండుగొలనులో మంగళవారం నిర్వహించాల్సిన వారపు సంతను ఈనెల 7వ తేదీ శుక్రవారానికి వాయిదా వేసినట్లు ఎంపీడీవో టి.స్వర్ణలత సోమవారం తెలిపారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈనెల 4వ తేదీ మంగళవారం కౌంటింగ్ నియమావళి దృష్ట్యా 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. ఈనెల 6న ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా చూడడం, గుండుగొలను గ్రామం సున్నిత సమస్యాత్మకంగా ఉన్నందున వారపు సంతను ఈనెల 7వ తేదీన నిర్వహించుకోవాలని సంబంధిత సంత నిర్వాహకులను ఆదేశించినట్లు ఎన్నికల అధికారులు పేర్కొన్నారు.

అభ్యర్థుల భవితవ్యం తేలేది నేడే..



చింతలపూడి పట్టణ వ్యూ

చింతలపూడి బరిలో అభ్యర్థులు..

చింతలపూడి అసెంబ్లీ నియోజకవర్గ బరిలో 8 మంది అభ్యర్థులు పోటీ చేయగా, టీడీపీ, వైఎస్సార్ సీపీల మధ్యే ప్రధాన పోటీ నెలకొంది.

అభ్యర్థి పేరు	పార్టీ	గుర్తు
కంభం విజయరాజు	వైఎస్సార్ సీపీ	ఫ్యాన్
సొంగా రోషన్ కుమార్	ఎన్‌డీఏ కూటమి	సైకిల్
ఉన్నమట్ల ఎలీజా	కాంగ్రెస్	హస్తం
లక్కపాం వెంకట చైతన్య	బహుజన పార్టీ	ఏనుగు
ఎస్తేరు రాణి	స్వతంత్ర అభ్యర్థి	గ్లాస్‌టంబ్లర్
పచ్చిగోళ్ల జాన్ ధర్మతేజ	స్వతంత్ర అభ్యర్థి	బ్యాట్
కలపాల ప్రసాద్	స్వతంత్ర అభ్యర్థి	గ్యాస్ స్టౌవ్
తొర్లపాటి శ్రీనివాసరావు	స్వతంత్ర అభ్యర్థి	రిమోట్

చింతలపూడి: జిల్లాలో అతి పెద్ద నియోజకవర్గంలో పాగా వేసేదెవరోనని అటు జిల్లాలోను, ఇటు నియోజకవర్గ ప్రజల్లోను తీవ్ర ఉత్కంఠ కొనసాగుతుంది. 2019 ఎన్నికల్లో నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఉన్నమట్ల ఎలీజా విజయం సాధించారు. ఆయన తన సమీప టీడీపీ అభ్యర్థి కర్రా రాజారావుపై 36,174 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. ప్రస్తుత ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ నుంచి కంభం విజయరాజు పోటీ చేయగా, టీడీపీ నుంచి సొంగా రోషన్ కుమార్ రంగంలో ఉన్నారు. ఉన్నమట్ల ఎలీజా ప్రధాన పార్టీ కాంగ్రెస్ నుంచి బరిలో నిలిచారు. టీడీపీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీకి కంచుకోటగా ఉంటూ వస్తున్న చింతలపూడి నియోజకవర్గం 2004లో మహా నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభంజనంలో హస్తగతమయ్యింది. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఘంటా మురళీరామకృష్ణ మాజీ మంత్రి కోటగిరి విద్యాధరరావుపై విజయం సాధించారు. 2009 ఎన్నికల్లో మరోసారి కాంగ్రెస్ అభ్యర్థి మద్దాల రాజేష్ కుమార్, టీడీపీ అభ్యర్థి డాక్టర్ కర్రా రాజారావుపై విజయం సాధించారు. ఈ సారి ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ, టీడీపీల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. నియోజకవర్గంలో 2,73,069 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో 1,34,296 మంది పురుషులు, 1,38,733 మంది స్త్రీలు, 41 మంది ఇతరులు ఉన్నారు. మే 13న జరిగిన పోలింగ్‌లో 2,22,608 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. వారిలో 1,10,679 మంది పురుషులు, 1,11,908 మంది స్త్రీలు ఉన్నారు.

మత్స్యకారుల వలకు భారీ చేప



ఎర్రకాలువ జలాశయంలో వలకు చిక్కిన చేప

జంగారెడ్డిగూడెం: కేకేఎం ఎర్ర కాలువ జలాశయంలో భారీ చేప లభించింది. సోమవారం మత్స్యకారులకు ఈ భారీ చేప లభించింది. భారీ చేప కావడంతో మాంస ప్రియులు కొనుగోలు చేసేందుకు ఎగబడ్డారు. చాలా రోజుల తరువాత జలాశయంలో వేట నిర్వహించామని, దీంతో ఈ భారీ చేప వలకు చిక్కిందని మత్స్యకారులు తెలిపారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



జంగారెడ్డిగూడెం ఛాంబర్ ఆఫ్ కామర్స్ నూతన కార్యవర్గ సభ్యులు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం ఛాంబర్ ఆఫ్ కామర్స్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికయ్యింది. సోమవారం ఛాంబర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అధ్యక్షులుగా వందనపు వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా పీపీఎస్ చంద్రరావు, కోశాధికారిగా దారా రవీంద్రలు ఎన్నికయ్యారు. అలాగే గౌరవ అధ్యక్షులు మండవల్లి సోంబాబు, గౌరవ సలహాదారుడిగా మహంకాళి రామ్మోహనరావు, యర్రంశెట్టి బాలకృష్ణ, ఉప్పల గంగాధరరావు, వందనపు రాజేంద్ర, ఉపాధ్యక్షులుగా కొల్లేపర ఆనంద్, తడికమళ్ల దుర్గారావు, వంకదార రాంబాబు, కోతాటి నాగేశ్వరరావు, మద్దుల రాంబాబు, సంయుక్త కార్యదర్శులుగా సొలస సురేష్, కర్పూరం జనార్ధన్, చోడే ఫణి చంద్రశేఖర్, గుళ్లపూడి ప్రవీణ్‌కుమార్, తడికమళ్ల రామ్మోహనరావులు ఎన్నికయారు. ఆదే విధంగా పట్టణంలోని వివిధ వ్యాపార సంస్థల నుంచి 30 మందిని డైరెక్టర్లుగా ఎన్నుకొన్నారు. కాగా చాంబర్‌కు లీగల్ అడ్వయిజర్‌గా ఏలూరి ఫణికుమార్, మీడియా కో-ఆర్డినేటర్‌గా సొలస శ్రీనివాసరావు వ్యవహరించనున్నారు.

పోలీస్ పహారా నడుమ జంగారెడ్డిగూడెం



జంగారెడ్డిగూడెం బస్టాండ్ సెంటర్‌లో పికెటింగ్ నిర్వహిస్తున్న పోలీసులు

జంగారెడ్డిగూడెం: ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో జంగారెడ్డిగూడెం పట్టణంలో పోలీస్ పికెటింగ్ నిర్వహిస్తున్నారు. జిల్లాలో ప్రస్తుతం 144 సెక్షన్, పోలీస్ యాక్ట్ 30 అమలులో ఉంది. ఈ నేపథ్యంలో డీఎస్పీ యు.రవిచంద్ర ఆధ్వర్యంలో సీఐ పి.రాజేష్, ఎస్సై జ్యోతిబాస్ తమ సిబ్బందితో కలిసి పట్టణంలో పికెటింగ్ నిర్వహిస్తున్నారు. పట్టణంలో ప్రజలు గుమికూడకుండా, దుకాణాల వద్ద గుంపులుగా ఏర్పడకుండా చర్యలు తీసుకున్నారు. ముఖ్యంగా జన సంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో కలియదిరుగుతూ పికెటింగ్ నిర్వహించారు. లాడ్జిలు, హోటళ్లు, వ్యాపార సముదాయాలు, దుకాణాలు, బార్‌లను మూయించి వేశారు. వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ యు.రవిచంద్ర మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం 144 సెక్షన్, పోలీస్ యాక్ట్ 30 అమలులో ఉందన్నారు. అనుమతి లేకుండా ప్రచారాలు చేయడం, గుమికూడటం, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడటం, శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించకూడదన్నారు. ఫలితాల రోజు ప్రజలు రోడ్లపైకి రాకుండా ఇళ్లలోనే ఉండి ఫలితాలను టీవీలో వీక్షించాలని సూచించారు. గొడవలు, విద్వేషాలు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం చేసినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. కౌంటింగ్ అనంతరం విజయోత్సవ ర్యాలీలు, బాణసంచా కాల్చడం, సభలు, సమావేశాలు, డీజేతో ఊరేగింపులకు అనుమతులు లేవన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు పోలీసు వారికి సహకరించాలని కోరారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళాలు



దాత రాటాలరాజుకు విరాళం బాండ్ పత్రాన్ని అందజేస్తున్న ఆలయ ఈవో త్రినాథరావు



దాత శేష చలపతికి విరాళం బాండ్ పత్రాన్ని అందజేస్తున్న ఆలయ ఈవో త్రినాథరావు

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఇద్దరు భక్తులు వేర్వేరుగా సోమవారం రూ.2,00,132 విరాళంగా అందజేశారు. టి.నరసాపురం మండలం మెట్టగూడెంనకు చెందిన నంద్యాల రాటాలరాజు రూ.1,00,016, ఏలూరు వాసి మదిరెడ్డి శేష చలపతి రూ.1,00,116 ఆలయ కార్యాలయంలో జమ చేశారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయ ఈవో వేండ్ర త్రినాధరావు విరాళం బాండ్ పత్రాలను అందించి, అభినందించారు. అనంతరం దాత కుటుంబాలకు స్వామివారి ప్రత్యేక దర్శన సౌకర్యాన్ని కల్పించారు.

మెరిట్ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



కొవ్వలిలో విద్యార్థులకు హరికృష్ణ ప్రతిభా పురస్కారాలు అందజేసిన దృశ్యం

దెందులూరు: విద్యావంతుడు, ఉపాధ్యాయుడు హరికృష్ణ ప్రతి ఒక్కరికీ స్ఫూర్తి అవుతారని దెందులూరు ఎంఈవో ఎవీఎస్‌వీ ప్రసాద్, మానవత విద్యానిధి చైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు అన్నారు. సోమవారం కొవ్వలి భక్తాంజనేయ ఆలయ ప్రాంగణంలో అమ్మ సోషల్ థాట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో న్యాయవాది కట్టా సత్యనారాయణ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. విద్యావంతుడై, ఉపాధ్యాయ వృత్తిని చేపట్టి అనేక మంది విద్యార్థులకు మార్గదర్శకుడైన హరికృష్ణను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు లక్ష్యాలను సాధించాలన్నారు. 2023-24లో 10వ తరగతిలో మొదటి, రెండు, మూడు, నాలుగు స్థానాల్లో నిలిచిన చిరంజీవి, తనుశ్రీ, హర్షగోపాల్, పార్వతి ప్రియాంక, వీరవాణి, హరికుమార్‌కు ప్రతిభా పురస్కారం అవార్డు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎస్‌ఎల్‌ఎన్‌వీజీ శర్మ, రిటైర్డ్ హెచ్‌ఎం కస్తూరిరావు చేతులు మీదుగా 20 మంది వృద్ధులకు రూ. 18 వేలు, బియ్యం అందజేశారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు షేక్ ముస్తాఫ్ అలీ, జీవీఎల్ నర్సింహరావు చేతులు మీదుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఇద్దరికీ రూ.10 వేలు అందజేశారు.

వృద్ధాశ్రమానికి అనాథ మహిళ



మహిళను వృద్ధాశ్రమానికి తరలిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

జంగారెడ్డిగూడెం: మతి స్థిమితం కోల్పోయిన అనాథ మహిళను వైద్య పరీక్షల అనంతరం ఐసీడీఎస్ అధికారులు నిడదవోలు వృద్ధాశ్రమానికి తరలించారు. జంగారెడ్డిగూడెం సీడీపీవో పి.బ్యూల తెలిపిన వివరాల ప్రకారం జంగారెడ్డిగూడెం అశ్వారావుపేట రోడ్డులోని మోర్ సూపర్ మార్కెట్ వద్ద సుమారు 58-60 సంవత్సరాల మధ్య వయసు గల గుర్తు తెలియని మహిళను స్థానికులు గుర్తించి సమాచారం ఇచ్చారన్నారు. మహిళను పేరు అడగ్గా వీరమ్మ అని తెలిపిందని, ఆ మహిళ రెండు కాళ్లకు దెబ్బలు తగిలి నడవలేని స్థితిలో ఉందన్నారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో రెండు రోజులపాటు ఆశ్రయం కల్పించి, ప్రథమ చికిత్స అందించారు. సోమవారం ఉదయం ఏరియా ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించి నిడదవోలు జీఎంఎస్‌కే వృద్ధాశ్రమానికి తరలించామన్నారు. మహిళా సంరక్షణ కార్యదర్శి, అంగన్‌వాడీ కార్యకర్తలు మహిళను వృద్ధాశ్రమానికి తరలింపులో సహాయాన్ని అందించినట్లు బ్యూల తెలిపారు.

గల్ఫ్ బాధితులకు సహాయంపై హర్షం

తాడేపల్లిగూడెం (టీఓసీ): గల్ఫ్ బాధితులకు గట్టిం మాణిక్యాలరావు సహాయం అందజేయడం హర్షణీయమని పలువురు అన్నారు. ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం చినవెల్లమిల్లి గ్రామానికి చెందిన యల్లవుల వీరమణి మలేషియాలో అనారోగ్యంతో మృతి చెందారు. అక్కడ యజమానులు నగదు చెల్లిస్తేనే మృతదేహాన్ని ఇండియాకు పంపుతామని చెప్పడంతో దిక్కుతోచని స్థితిలో ఆమె కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. మృతదేహాన్ని ఇండియాకు రప్పించాలని కోరుతూ గల్ఫ్ దేశాల్లో ఇబ్బందులు పడుచున్న వారికి సహాయం అందజేసే లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావుకు తాడేపల్లిగూడెంలో వారు వినతిపత్రం అందజేశారు. మాణిక్యాలరావు కృషి చేసి వీరమణి మృతదేహాన్ని ఇండియాకు రప్పించడంతో పాటు ఉచితంగా అంబులెన్స్ ఏర్పాటు చేశారు. మృతదేహాన్ని చిన్నవెల్లమిల్లిలోని వీరమణి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతదేహాన్ని రప్పించినందుకు సోమవారం మాణిక్యాలరావును కలిసిన వీరమణి కుటుంబ సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్యే, ఎంపీ విజయాల కోసం ఆలయాల్లో పూజలు



మొక్కుతీర్చుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి కట్టా ఏసుబాబు

దెందులూరు: సీఎంగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, దెందులూరు ఎమ్మెల్యేగా కొఠారు అబ్బయ్యచౌదరి, ఏలూరు ఎంపీగా కారుమూరి సునీల్ కుమార్ విజయం సాధించాలని వైఎస్సార్‌సీపీ వైద్యవిభాగ పీఆర్వో ఎన్.మల్లిక్ సోమవారం నాగులదేవునిపాడు ఆర్‌సీఎం చర్చిలో ప్రార్థనలు నిర్వహించారు. ద్వారకాతిరుమల వేంకటేశ్వర స్వామి సన్నిధిలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి కట్టా ఏసుబాబు తలనీలాలు ఇచ్చి పూజలు నిర్వహించారు. గుబ్బల మంగమ్మ ఆలయంలో, జోగన్నపాలెంలో కనకదుర్గమ్మ, గాలాయగూడెం అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి, రాట్నాలమ్మ ఆలయాల్లో పూజలు నిర్వహించి కొఠారు అబ్బయ్యచౌదరి, కారుమూరి సునీల్‌కుమార్, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎమ్మెల్యేగా, ఎంపీగా, సీఎంగా విజయం సాధించాలని ఏసుబాబు వివరించారు.

వైభవంగా శివునికి వెండి నాగాభరణం అలంకరణ



సత్యవోలులోని సుందరంగా అలంకరించిన స్వామివారు



సత్యవోలులో శివాలయంలో స్వామివారికి వెండి ఆభరణాన్ని సమర్పించేందుకు వెళ్తున్న దాత

పెదపాడు: సత్యవోలు గ్రామంలో ఇటీవల నిర్మాణం చేసిన శివాలయంలోని శివలింగానికి పెదపాడు గ్రామానికి చెందిన రెడ్డి లక్ష్మణరావు కేజీ వెండితో సుమారు రూ.లక్ష విలువైన వెండి నాగాభరణాన్ని సమర్పించారు. ఈమేరకు సోమవారం సత్యవోలు రామాలయం సెంటర్ నుంచి భక్తులు వెండి నాగాభరణాన్ని దాత తలపై పెట్టుకుని ఊరేగింపుగా బాజా భజంత్రీలతో ఊరేగింపుగా తీసుకువెళ్లి స్వామి వారికి సమర్పించారు. స్వామివారికి వెండి ఆభరణాన్ని సమర్పించే ముందు శివునికి పంచామృతాలతోను పండ్ల రసాలు, కొబ్బరినీళ్లు, గంధం, విభూది, పన్నీరులతో అభిషేకం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు అభినాష్ వేద మంత్రోచ్ఛరణలతో స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పుష్పాలతో స్వామిని సుందరంగా అలంకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యుడు బొమ్మి ప్రభాకరరావు, కొట్నాన వెంకట్రావు, టంగుడు ఆంజనేయులు, తెంటు శ్రీనివాసరావు, రంభనాగరాజుతో పాటు ఇతర సభ్యులు గ్రామంలో పలువురు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కోడిపందేలపై దాడి..15 మంది అరెస్ట్



కోడిపందేలరాయుళ్లు, వాహనాలతో పోలీసులు

ఏలూరు టౌన్: ఏలూరు వన్‌టౌన్ పరిధిలో పోణంగిలోని ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్ సమీపంలో కోడిపందాలు నిర్వహిస్తుండగా సోమవారం ఉదయం సీఐ ఎస్ రాజశేఖర్ ఆధ్వర్యంలో వన్‌టౌన్ ఎస్సై నవీన్ తన సిబ్బందితో దాడి చేశారు. 15 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకుని రూ.30 వేలు నగదు, ఒక కోడి, 15 మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేశారు.

ఉపాధ్యాయ, పాఠశాలల సమస్యలపై వినతి



డీఈఓకు వినతిపత్రం అందిస్తున్న యూటీఎఫ్ నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలో ఉపాధ్యాయులు, పాఠశాలల్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ యూటీఎఫ్ జిల్లా నాయకత్వం డీఈఓ ఎస్ అబ్రహాంకు సోమవారం వినతిపత్రం అందజేశారు. పాఠశాలల నిర్వహణ గ్రాంట్లకు సంబంధించి ఆడిట్‌ను వేసవి సెలవుల అనంతరం నిర్వహించాలని, అన్ని మండలాల్లో ఒకే విధంగా 1/3 పాఠశాలను పిలిసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఏలూరు జిల్లాలో జనరల్ ఎలక్షన్ డ్యూటీ సర్టిఫికెట్లు ఎంఈఓల ద్వారా అందజేయాలని పేర్కొన్నారు. జేవీకే కిట్స్‌ను పాఠశాల పాయింట్లకు సరఫరా చేయాలని, ముంపు మండలాలకు హెల్త్ కార్డులు ఇప్పించాలని కోరారు. 2023 వేసవి సెలవుల్లో ఇండక్షన్ ట్రైనింగ్ ఇచ్చిన ఉపాధ్యాయులకు ఈఎల్ మంజూరు చేయాలని, ఎస్ఎస్‌సీ పరీక్షల డ్యూటీ చేసిన ఉపాధ్యాయులకు రెమ్యూనరేషన్ ఇప్పించాలని పేర్కొన్నారు. టీచర్లు సెలవులు నష్టపోకుండా చేయాలని, ఇంటర్మీడియట్ బోధించే వారు కింది క్లాసుల సబ్జెక్టులు కూడా బోధించేలా మార్గదర్శకాలు ఇవ్వా లని పేర్కొన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతానని డీఈఓ హామీ ఇచ్చారని కృతజ్ఞతలు తెలిపారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ రుద్రాక్షి, కార్యదర్శి ఇ.శివశంకరరావు, ఆడిట్ కన్వీనర్ మోహన్‌రావు, తేరా ప్రసాద్ పాల్గొన్నారు.

11 పోలీస్ పికెట్ల ఏర్పాటు

దెందులూరు: సార్వత్రిక ఎన్నికలు కౌంటింగ్‌లో భాగంగా జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు దెందులూరు మండలంలో 11 పోలీస్ పికెట్లు ఏర్పాటు చేశామని దెందులూరు ఎస్సై కె.స్వామి అన్నారు. సోమవారం దెందులూరు పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ మండలమంతా నాలుగు మొబైల్ పోలీస్ పార్టీలు పహారా కాస్తున్నాయన్నారు. అన్ని గ్రామాల్లో కేంద్ర సాయుధ బలగాలు జల్లెడపడుతున్నాయని వివరించారు.6వ తేదీ వరకు సెక్షన్ 30, సెక్షన్ 144 అమలులో ఉన్నాయన్నారు. అన్ని రాజకీయ పార్టీలు, ప్రజలు, సెల్‌ఫోన్‌లో పోస్టింగులు, ర్యాలీలు, సభలు, సమావేశాలు, బాణసంచా కాల్చడం చేయరాదన్నారు. రౌడీషీటర్ల అందరిపై పూర్తి నిఘా ఉందని, ఎవరైనా అల్లర్లు చేసినా శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా ఎన్నికల కేసులో నేరస్తులుగా చేయడం జరుగుతుందని ఎస్సై కె.స్వామి హెచ్చరించారు.